

కథా కౌముది

# నెక్స్ట యమున చింతపల్లి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"నాకు ఏదో అనుమానంగా ఉంది"

"దేని గురించి "

"రావలసిన డేట్ దాటిపోయి నాలుగు రోజులు అయ్యింది"

"ఛా, వద్దన్నా వినలేదు నువ్వు.... అందుకే ఇలా అయ్యింది" విశాల్ కంఠం నిండా విసుగు.

నన్ను తప్పు పట్టటం యెంతో తేలిక విశాల్ కు. తనని పెళ్లి చేసుకున్న ఈ రెండేళ్ళల్లో నేను గమనించిన విషయం అది.అసలు అది మాత్రమే తేలిక తనకి. ఇంటి పని అందుకోవటం,చిన్ని చిన్ని అందాలను ఆస్వాదించటం అవన్నీ కష్టమే. కాని ఆ తేలిక తనాన్ని అంత తేలికగా ఈ మాటు భరించాలనిపించలేదు.

"చూడు విశాల్, కొన్నిపనులు కేవలం ఒక్కరు మాత్రమే చెయ్యలేరు.రెండు చేతులూ కలిస్తేనే జరుగుతాయి" నా గొంతులో తీవ్రత నాకు తెలుస్తూనే ఉంది.

"నిజమే.కాని అర్ధరాత్రి నిద్ర పోతున్న నన్ను లేపి...."

"చట్ " చిటుక్కున అక్కడనుండి లేచి వెళ్లి పోయాను.

పున్నమి రోజున చంద్రుని చూసి మనసులో చెలరేగే ప్రణయ భావాలకి అడ్డుకట్ట వెయ్యలేక జీవితభాగస్వామి 'తట్టి లేపి', ఎదచేరి....అనుభవించి, ఆస్వాదించి......అలసి... ఆ జ్ఞాపకాన్ని పదిలపరుచుకోవటమే నేను చేసిన తప్పా? ఇది తప్పు ఒప్పుల సమస్య కాదు.ఆ కలయిక ఓ జీవిగా ఊపిరిపోసుకుంటుందేమో అనే భయం. అలా ఊపిరి పోసుకోకూడదనే ఓ ఆలోచన....

ఆ ఆలోచన విశాల్ కే ఉందా....నాకు లేదా? నాకూ ఉంది. ఈ ఆలోచన పాపం కాదా?కాదు,కాదు...బంగారు భవిష్యత్తు పట్ల మమకారం. ఎవరికి బంగారు భవిష్యత్తు? నాకా...మాకా...ఎప్పుడో భవిష్యత్ లో పుట్టబోయే బిడ్డకా... 'అందరికి'. 'అందరికా ' ఎవరో నిలదీస్తున్న భావన. మళ్ళీ ఆలోచన విశాల్ మాటల మీదకి మళ్ళింది.అసలు విశాల్ అంత చీప్ గా యెట్లా మాట్లాడాడు నన్ను భాద్యురాలిని చేస్తూ...

"మనం తొందరపడ్డాము.కాస్త జాగ్రత్తలు తీసుకునుంటే బాగుండేది" అని విశాల్ మాట్లాడి ఉంటే కొంత ఊరటగా అనిపించేది. కాని ఇలా నన్ను వేలెత్తి చూపటం నాకు కష్టంగా ఉంది.

"కూల్ ఇందు! ఒక్కోసారి పిరియడ్ మామూలుగా ఆలస్యం అవ్వొచ్చు కదా| ముందు టెస్ట్ చేసి ప్రెగ్నన్సీ అవునో కాదో తేల్చుకో. ఆ తరువాత ఆలోచిద్దాము ఏం చెయ్యాలో" టీ ని మరగపెడుతున్న నా వెనకగా విశాల్. తనలో నచ్చేది అదే. తను తొందరపడ్డా , నేను తొందరపడ్డా ముందుగా అడుగేసి అనునయంగా మాట్లేడేది విశాలే.

"ప్రెగ్నన్సీ టెస్ట్ కిట్ కొనుక్కొచ్చుకోవాలి. ఇప్పుడు ఆఫీసు టైం అయ్యిందిగా. సాయంత్రం టెస్ట్ చేసుకుంటాను" అంతకు ముందు తన మీదున్న ఉన్న చిరాకు పోయి నా బాధ ని చెప్పుకోవటానికి అవకాశం వచ్చిందనే రిలీఫ్ తో నా జవాబు.

"టెన్షన్ పడకు . అలాంటి తప్పు అవ్వదులే " అన్నాడు నా భుజం మీద చెయ్యివేసి ధైర్యం చెపుతున్నట్లుగా.

ఏది తప్పు? ఆ రాత్రిని ఆస్వాదించటమా...కన్సీవ్ అవ్వటమా? దానికి సరియైన జవాబు నా దగ్గర ఏమి లేదు మూగ పోయిన మనసు తప

★★★★

"ఏంటి ఇందూ ,ఈ రోజు అంత డల్ గా ఉన్నావు?" కొలీగ్ స్నేహ ప్రేమగా అడిగింది.

"టెన్షన్ గా ఉంది"

"దేనికీ , ప్రమోషన్ వస్తుందో రాదో అనా"

"దాని గురించి కాదు ప్రెగ్నన్సీ ఏమో అని భయంగా ఉంది"

"ఏంటి, జాగ్రత్తలు తీసుకోలేదా ? నీకు ప్రమోషన్ వస్తుందని గట్టి నమ్మకం ఉంది. ప్రమోషన్ వచ్చిన వాళ్ళని ఒక సంవత్సరం పాటు ప్రాజెక్ట్ కోసం అమెరికా పంపిస్తారని నీతో సహా అందరికీ తెలిసిన విషయమే. ఈ పరిస్థితి లో ప్లాన్ లేకుండా నువ్వు ఇలా చెయ్యటమేమిటీ?" కసిరినట్లే అడిగింది.

స్నేహ నా కన్నా రెండేళ్ళు సీనియర్. చాల కలిసిపోయే తత్వం. రెండుసార్లు ప్రేమ విఫలం అయిన తరువాత ఇప్పుడు 'సహజీవనం' లో ఉంది. నా పెళ్లి కుదిరిందని చెప్పగానే ' ఇందూ , చేసుకున్నవాడు ఎలాంటి వాడో తేలేదాకా పిల్లల గురించి ఆలోచించకు. ఒక వేళ ఏదన్నా తేడా వచ్చి విడాకులు తీసుకోవాలంటే పిల్లలు ఉంటే పెద్ద తలనొప్పి. ఆ తరువాత వేరే పెళ్లి చేసుకోవాలన్నా కూడా కష్టమే" అని సలహా చెప్పిన వ్యక్తి.

"ఈ నెల నేను ఫ్యామిలీ ప్లానింగ్ పిల్స్ వాడల. రోజుల లెక్క , ఇంకా వేరే పద్ధతులు ఫాలో అవ్వటంలో ఏదో పొరపాటు జరిగింది"

"ఉద్యోగం, జీవితం రెండూ తేలికగా తీసుకునే నాలాంటి వాళ్ళంటే ఫరవాలేదు. కెరియర్ మీద శ్రద్ధ, మంచి క్వాలిఫికేషన్స్ (అర్హతలు) ఉన్న నీలాంటి వాళ్ళు ఇలా ఉంటే ఎలా ఇందు?"

నిలదీసి అడుగుతున్న స్నేహకు జవాబు చెప్పలేనట్లు నిస్సహాయంగా చూసాను. నా మొహం చూసి జాలేసిందేమో "కూల్, ఇందు. డోంట్ వర్రీ. అదే నిజమైతే నెక్స్ట్ ఏం చెయ్యాలో ఆలోచించు.డి.ఎం.సి చేయించుకోవచ్చు. చేయించుకున్న కొన్ని గంటలలోనే డిశ్చార్జ్ చేసేస్తారు. జస్ట్ టు డేస్ రెస్ట్. అంతే.సాధ్యమయినంత తొందరగా చేయించుకోవటం మంచిది. ధైర్యంగా ఉండు. నేను హెల్ప్ చేస్తాను. నాకు ఆ విషయం లో కూడా అనుభవముందిలే. మీ పెద్ద వాళ్లకు మాత్రం తెలియనీకు. వాళ్ళు ఇలాంటి నిర్ణయాన్ని ఒప్పుకోకపోవచ్చు. వాళ్లకి సెంటిమెంట్స్ అడ్డువస్తాయి" అని ఏ భావము లేకుండా యెంతో మామూలుగా చెప్పింది.

నాలో ఏదో ఒత్తిడి...తలలో భారం. ఇహ తట్టుకోలేక 'కాఫీ తాగి వస్తాను' అని నా ఆలోచనలను కూడగట్టుకుని ఒంటరిగా క్యాంటీన్ కి బయలుదేరాను.

★★★★

నా టెన్షన్ కి తోడు ఆఫీసులో పని ఎక్కువయ్యి బయటపడేసరికి ఏడు దాటిపోయింది. వస్తూ వస్తూ మెడికల్ షాప్ లో 'ప్రెగ్నాఎడ్వాన్స్ డివైస్' కిట్ కొనుక్కొచ్చాను. ప్రొద్దున్నుండీ వర్క్ తో బిజీ గా ఉండి ఈ విషయం గురించి ఆలోచన , ఆందోళన తగ్గింది. ఈ కిట్ కొనగానే మరల మొదలయ్యింది. 'ప్రెగ్నెన్సీ అవునా , కాదా' దోవంతా ఒకటే ఆలోచన.

రాగానే టెస్ట్ చేసాను. టెస్ట్ రిజల్ట్స్ తెలిసే ఆ కొన్ని నిమిషాలు నా గుండె చప్పుడు నాకే వినపడుతోంది....రిజల్ట్ నెగటీవ్ వచ్చింది. 'హమ్మయ్య , నేను భయపడ్డట్లు ఏమీ కాలేదు. నా ప్రమోషన్, ఆ పైన ప్రాజెక్ట్ కు అమెరికా వెళ్ళటం అన్నీ హాయిగా జరిగిపోతాయి. ఇహ ఏ సమస్య లేదు' ఆనందంతో బాత్ రూమ్ లో ఎదురుగా అద్దం లో కనపడుతున్ననా ప్రతిబింబానికి 'ఇందు, యు ఆర్ లక్కీ ' అని చెయ్యెత్తి థమ్సప్ సైన్ చూపించాను .

విశాల్ కి ఫోన్ చేసాను. డ్రైవింగ్ లో ఉన్నాడేమో మొబైల్ ఎత్తలేదు. నా సంతోషాన్ని వెంటనే ఎవరితో ఒకరితో పంచుకోవాలని తీవ్రమైన కోరిక. అమ్మా, నాన్నలకి చెప్పలేను. ఇంకా ఎవరు? స్నేహతో చెపితే? అవును,తను కూడా సంతోష పడుతుంది.. వెంటనే ఫోన్ చేసాను.

ఫోన్ లో విషయం చెప్పాను. 'కంగ్రాట్స్ . నాకు చాల సంతోషంగా ఉంది. చిన్న విషయం ఇందు, ఆ టెస్ట్ కరక్ట్ గానే వస్తుంది కాని ఒక్క శాతం తప్పయ్యే అవకాశం ఉంది. అందుకని నువ్వొక పనిచెయ్యి . రేప్రొద్దున నిద్ర లేవగానే ఎర్లీ అవర్స్ యూరిన్ తో టెస్ట్ చేసుకో. అప్పుడు చేస్తే వచ్చే రిజల్ట్ నూటికి నూరు పాళ్ళు కరెక్ట్. ఆ సారి రిజల్ట్ కూడా నెగటీవ్ వస్తే ప్రెగ్నెన్సీ రాలేదని ఖచ్చితంగా నమ్మొచ్చు. ఆల్ ది బెస్ట్" అని చెప్పి ఫోన్ పెట్టేసింది స్నేహ.

క్షణం క్రితం ఉన్న ఆనందం ఆవిరయిపోయింది. అరగంట తరువాత వచ్చిన విశాల్ కు విషయం చెప్పాను.

"ఇది తప్పయ్యేందుకు వన్ పర్సంటే కదా ఛాన్స్. రేపు కూడా నెగటీవే వస్తుందిలే. టెన్షన్ పడకు. ఆలసిపోయినట్లున్నావు. తొందరగా పడుకో " అంటూ తేలిగ్గా తీసుకుని భోజనం చేసి హాయిగా నిద్రపోయాడు.నాకు మటుకు అస్సలు నిద్ర రాలేదు. ఒకటే టెన్షన్. ఆందోళన పడీ పడీ అలసిపోయి అర్ధరాత్రి ఎప్పుడో నిద్రపోయాను.

★★★★

తెల్లవారుతుండగా మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి లేచి హడావిడిగా వెళ్లి టెస్ట్ చేసుకున్నాను.

రిజల్ట్స్ తెలిసే ఆ నాలుగు నిమిషాల్లో అమెరికా ప్రాజెక్ట్ నుండి రక రకాల దేవుళ్ళ ప్రార్ధనలు దాకా అన్నీ బుర్ర లో గిర్రున తిరిగాయి.... రిజల్ట్ పాజిటీవ్.... కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి...ఛా , ఇహ నా అమెరికా ప్రయాణం, ప్రాజెక్ట్ అన్నీ గాల్లో కలిసిపోయినట్లేనా?ఊహు, వాటిని పోగొట్టుకోను...పోగొట్టుకోకూడదు. మరి ఏమి పోగుట్టుకోవాలి?

మనసంతా విచారం....ఎలాగో నడుచుకుంటూ వెళ్లి హాల్లో సోఫాలో వాలి పోయాను. కడుపులో తిప్పుతున్నట్లుంది. కడుపుతో ఉన్న ఫలితమా లేదా రాత్రి నిద్ర లేని కారణమా?! నేనేం దోషం చేసానని నాకు ఈ శిక్ష.

సినిమాల్లో , నా తోటి ఉద్యోగస్తులు కడుపుతో ఉన్నామని తెలియగానే స్వీట్లు పంచటం , హడావిడి చెయ్యటం చూసాను. మరి నేనేంటి శిక్షలా అనుకుంటున్నాను. నాకెందుకు ఇంత దుఃఖం ...నేను మంచి అమ్మని కాదా ? రాక్షసినా? ఉహు, నేను మంచి అమ్మనే. ఎక్కడ పిల్లల్ని చూసినా పలకరించకుండా ఉండలేను. వాళ్ళని చూస్తేనే చాలు నాకు చాల సంతోషంగా అనిపిస్తుంది. నన్ను నేను మరిచిపోయి ముద్దు చేస్తాను. కాని ఇప్పుడే తల్లిని అయ్యి ఉద్యోగంలో ఎదిగే అవకాశాన్ని వదులుకోవటం నాకు,విశాల్ కి ఇద్దరికీ ఇష్టం లేదు. అందుకే ఈ బాధంతా.

"ఏంటి ఇందూ, ఇక్కడ పడుకున్నావు. ఒంట్లో బాలేదా" లేచి వచ్చిన విశాల్ ప్రక్కన కూర్చుని ఆత్రుతగా అడిగాడు. ఆపుకోలేని దుఃఖంతో విశాల్ ని చుట్టేసాను.

★★★★

ఆఫీసుకి లీవ్ మెయిల్ చేసి హాస్పటల్ లో అడుగుపెట్టాను. ఎన్నో ప్రైవేట్ హాస్పిటల్స్ లానే ఆ ఆసుపత్రి కూడా కళ కళ లాడుతోంది...హాస్పిటల్ కళ కళలాడటం అనటం తప్పేమోరిసెప్షన్ లో డబ్బులు చెల్లించి , పేరు రాయించుకుని టోకెన్ తీసుకున్నాను. నా నెంబర్ పది. వెయిట్ చెయ్యాలి. వచ్చి కుర్చీలో కూర్చుని చుట్టూతా చూసాను.

నా ప్రక్కన చేతిలో చిన్న బిడ్డతో ఓ అమ్మాయి. నా వయసే ఉంటుంది. ఆ బిడ్డ మీదకి వంగుని ముద్దు చేస్తూ ఇంకో యువతి . ఆ అమ్మాయి చెల్లెలేమో. ఇంకో ప్రక్క గుస గుస లాడుకుంటూ యువతీ , యువకుడు. మరో ప్రక్క మధ్య వయస్కురాలు. ఆమె ప్రక్కన కూతురో లేక కోడలోకూర్చునుంది. నా పరిస్థితి తెలిసుంటే అమ్మో, అత్తయ్యో ఇలాగే ఊరినుండి ఆఘమేఘాల మీద ఊడిపడి నాకు తోడుగా వచ్చేవారేమో. కాని వాళ్ళకి తెలియటం మాకిష్టం లేదు. అందుకే చెప్పలేదు. బహుశా నేను ఒక్కదాన్నేనేమో ఒంటరిగా వచ్చింది. రేపు అయితే విశాల్ కూడా వచ్చేవాడు. ఈ రోజు తన ఆఫీసు హెడ్ వస్తున్నాడు. సెలవు తీసుకోవటం కష్టం. రేపటిదాకా ఆగే ఓపిక లేక ఒక్కదాన్నే వచ్చేసాను.

ఎత్తైన పొట్టతో ఆయాస పడుతూ ఓ పాతికేళ్ళ అమ్మాయి, ఆమె చేతిని పట్టుకుని ఓ పెద్దామె నడుచుకుంటూ వచ్చి నా ఎదురు కుర్చీలో కూర్చున్నారు. నాకు కూడా అంత పెద్ద పొట్ట వస్తుందా...ఊపిరి ఆడుతుందా ...నేను వచ్చినది ఎందుకు ... ఆలోచించే విషయం ఏమిటీ ? అదా నా భవిష్యత్? ఉహు, అది కాదు.అది కాకపోతే మరేమిటీ? అదీ నా భవిష్యత్ లో భాగమే కాని అది ఇప్పుడు కాదు. మరి ఎప్పుడు? ....రక రకాల ఆలోచనలతో అయ్యోమయంగా ఉంది.

"ఎన్నో నెల " ఇంకాస్త ఆవల కూర్చుని ఉన్నామె నా ఎదురుగా కూర్చున్నామెని ఆసక్తిగా అడిగింది.

"ఎనిమిదో నెల"

"పెళ్లి అయ్యి ఎన్నేళ్ళు"

"పెళ్లి అయి ఇంకో రెండు నెలలకి ఏడాది నిండుతుంది "

"వెంటనే వచ్చిందా "

"అవును. 'హాయిగా , స్వేచ్చగా ఎంజాయ్ చెయ్యక ఈ పిల్లల గోల ఏమిటీ' అని వాళ్ళు ఏదో పిచ్చి పని చేద్దామనుకున్నారు. 'ఫ్యామిలీ ప్లానింగ్ టాబ్లెట్స్ ఏళ్ళతరబడి వాడటం, ఏదన్నా తేడా వస్తే అడ్డు తొలగించుకోవటం....అవన్నీఆరోగ్యమైన పనులు కావు. తొందరపడి తిక్క పనులు చెయ్యకండి. మీకు ఇబ్బంది లేకుండా పుట్టే బిడ్డని మేమే పెంచుతాము' అని ఇరు పెద్దలం అడ్డంపడి చెప్పి ఎలాగో ఒప్పించాము" ఆమె దభాయించి చెపుతోంది. ఆ కడుపుతో ఉన్న అమ్మాయి చిరాకును అణచుకుంటున్నట్లు చూస్తోంది.

ఏంటో మనసంతా గందరగోళంగా ఉంది. మొబైల్ లో వాట్సప్ ఓపెన్ చేశాను. జోక్స్, మంచి మెసేజస్, పిల్లల సరదా వీడియోలు .....దానిలో పూర్తిగా మునిగిపోయాను.

"హాయ్ ఇందు " పలకరింపుకు తలెత్తి చూసాను. ఎదురుగా మధురిమ నాలుగేళ్ల తన పాప చెయ్యి పట్టుకుని.

"హాయ్, మధూ ఎలా ఉన్నావు"

"బ్రహ్మాండంగా ఉన్నాను. నువ్వేంటి ఇక్కడికి వచ్చావు...ఏదన్నా శుభవార్తా " మొహమంతా సంతోషం నింపుకుని అడుగుతోంది మధురిమ.

ఏం చెప్పాలో అర్థం కాలేదు.ఇంతలో 'ఆంటీ , మీ ఫోన్ లో కొత్త గేమ్స్ ఉన్నాయా " అంటూ నాలుగేళ్ల పాప నా చేతిలో ఫోన్ తీసుకోవటంతో సంభాషణ మారి పోయింది.

"దీనికి , భలే తెలివి. ఏది చూసిన యిట్టే పట్టేస్తుంది. డాన్స్ నేర్చుకుంటోంది . ఆ టీచర్ కూడా 'మీ అమ్మాయి చాల ఫాస్ట్ అండీ అంటుంది'. స్టేట్ కాపిటల్స్ అన్నీ చెప్పేస్తుంది. యు ట్యూబ్ లో పెట్టాను. లింక్ పంపుతా చూడు " గల గలా తన పాప తెలివి గురించి ఆనందంగా చెపుతోంది.

"అమ్మా , నేను చెల్లి తో ఆడుకోవాలంటే ఇంకా ఎన్ని రోజులు ఆగాలి' తను ఇక్కడికి వచ్చినది ఎందుకో గుర్తుకొచ్చినట్లు ఫోన్ నా చేతికిచ్చేసి ఊపిరి ఆడకుండా అడుగుతోంది పాప.

బి.టెక్. అయ్యి ఉద్యోగంలో చేరిన ఆరునెలలకే మధురిమకి పెళ్లి చేసేసారు పెద్దలు. పెద్ద కుటుంబము, వచ్చిపోయే బంధు వర్గము...చాల బిజీ జీవితం తనది. పెళ్లి అయ్యి ఏడాది తిరక్కుండానే పాప. దాంతో జాబ్ కి స్వస్తి చెప్పి కుటుంబ భాధ్యతలను స్వాగతించింది. అంత తీరుబడి లేని జీవితమైనా కూడా అందరితో ఉన్న స్నేహబంధాన్ని చాల చక్కగా నిలుపుకుంటుంది.

"ఇది వేసే ప్రశ్నలతో మనం మాట్లాడుకోవటానికి ఉండదు. ఓ సారి నువ్వు, విశాల్ భోజనానికి ఇంటికి రండి. గుడ్ న్యూస్ ఉంటే ఫోన్ చేసి చెప్పు ఇందూ " అంటూ పిల్లని తీసుకుని వెళ్ళిపోయింది.

ఆనాడు అంత తొందరగా పెళ్లి చేసుకుని వెంటనే పిల్లని కనేసిన దాన్ని చూసి ఫ్రెండ్స్ అందరం తెగ బాధ అయిపోయాము. కాని దాని మొహం లో ఉన్న ఆనందం, తృప్తి చూస్తే మేము పడ్డ బాధ తప్పేమో అనిపిస్తోంది.

" ఈ మా బంగారు తల్లి పెంపకం కోసం మీ అమ్మ ఉద్యోగం వదులుకుంది" అని నాన్న ఒకసారి మురిపెంగా నాతో అన్న మాటలు కూడా ఆ క్షణం గుర్తుకొచ్చాయి. అది విన్న ఆ రోజు 'నాకోసం అమ్మ ఉద్యోగం వదులుకుంది' అని నాలో ఓ గర్వం. అలాంటిది ఈనాడు నేను ఆలోచిస్తున్నది ఏమిటి?

"మేడం, మీరు రూమ్ లోకి వెళ్లి కూర్చోండి" రిసెప్షన్ మాటలకు 'లోపల ఇంకో రౌండ్ వైటింగా' అనుకుంటూ రూమ్ లోకి నడిచాను.

" 'పెళ్ళవ్వగానే పిల్లలేంటీ ' అని మూడు సంవత్సరాలుగా మందులు మింగావు. అప్పుడు వద్దనుకున్నావు ఇప్పుడు కావాలనుకుంటే ప్రెగ్నన్సీ రావటం లేదు" డాక్టర్ రూమ్ నుండి బయటకు వచ్చి నన్ను దాటి వెడుతున్న ఆ మధ్య వయసామె ప్రక్కనున్న అమ్మాయితో అంటున్న మాటలు వినపడి నా మనసులో ఏదో కలవరం.ఆ అమ్మాయి మొహం నిండా విచారం.

★★★★

మధ్యలో స్క్రీన్ తో రెండుగా డివైడ్ చెయ్యపడ్డ ఆధునికంగా ఉన్న ఏసి రూమ్ అది. అక్కడున్న కుర్చీలో కూర్చున్నాను. అవతల డాక్టర్ పేషెంట్ తో ఏదో జోకు వేసినట్లుంది . నవ్వులు వినపడుతున్నాయి.

డాక్టర్స్ కి జాలీ మూడ్స్ కూడా ఉంటాయా? 'కార్పోరేట్ ఉద్యోగాలు మెకానికల్ ,ఎలా చేస్తారో' అని మమ్మల్ని అంటారు కాని ప్రొద్దున్నుండి రాత్రి దాకా రక రకాల కేసులు...ఒకరు బిడ్డ కావాలని వస్తే మరొకరు వద్దని, వచ్చిన గర్భాన్ని నిలుపుకోవాలని తాపత్రయంతో కొందరు వస్తే వచ్చిన గర్భాన్ని పోగొట్టుకోవాలని ఇంకొకరి ఆరాటం ....ఆత్రుత ఆపుకోలేక ఆడా, మగా అని అనుమానం తీర్చుకోవటం కోసం ఇంకొందరు. అమ్మో , అన్ని రకాల మనుష్యలతో డీల్ చెయ్యటం యెంత కష్టమో!

"ప్రీతి, ఈ సారి కూడా అబార్షన్ చేయింకోవాలనుకుంటున్నావా? డాక్టర్ గానే కాదు నీ మంచి కోరే మనిషిగా కూడా చెపుతున్నాను. ఇప్పటికే రెండు సార్లు అబార్షన్ చేయించుకున్నావు. అసలే ఈ రోజుల్లో ఆలస్యంగా పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. దానికి తోడు పిల్లలు , పెంపకం మీ ఎదుగుదలకు అడ్డమని ఇలా చేసుకుంటూ పోతే కావాల్సినపుడు కన్సీవ్ కాలేకపోవచ్చు. ఇంకోసారి ఆలోచించు" జాలీ మూడ్ ప్రక్కన పెట్టి స్థిరంగా చెప్పిన డాక్టర్ మాటలు బయటకు వినపడ్డాయి.

"లేదు డాక్టర్. ప్లానింగ్ ఫెయిల్ అయ్యి వచ్చిన ప్రెగ్నంసీ కాదిది. బేబీ కావాలని నేను , మా వారు నిర్ణయించుకున్నాము. సో, వుయ్ ఆర్ డ్రీమింగ్ ఎబౌట్ అవర్ స్వీట్ బేబీ"

"ఓహ్, దెన్ కంగ్రాట్స్". పది నిమిషాలు మౌనం. రిపోర్ట్స్ ఏమన్నా చూస్తోందో ... టెస్ట్ చేస్తోందో!?

"గుడ్ ప్రీతి. ప్రెగ్నెన్సీ వద్దనుకుని ఒకటికి రెండుసార్లు అబార్షన్ చేయించుకున్నా కావాలనుకోగానే కన్సీవ్ అవ్వటం అంత తేలిక కాదు. అందరికీ ఇలా జరగక పోవచ్చు.ఆ విధంగా నువ్వు చాల లక్కీ ప్రీతి. యై యాం వెరీ హ్యాపీ ప్రీతి" సంతోషం నిండిన గొంతుతో అభినందిస్తోంది డాక్టర్.

"థాంక్ యు డాక్టర్ " అని చెప్పి ఇవతలకు వచ్చిన ఆ ప్రీతి అనబడే ఆమె మొహం నిండా ఏదో ఆనందం, విజయ గర్వం.

"నెక్ట్స్" డాక్టర్ పిలిచింది.

"అవును , నెక్ట్స్ ఏమిటీ ? నేనేం చెయ్యాలి ? ఏది నిలుపుకోవాలి... కెరియర్ నా ....బిడ్డనా? "

"నెక్ట్స్" మరోసారి గట్టిగా పిలిచిన డాక్టర్ పిలుపుకు మనసు నిండా ముసురుకున్న ఆలోచనలతో లేచి స్క్రీన్ అవతల అడుగు పెట్టాను.

★★★★

Click here to share your comments on this story